క్లుప్తంగా

నగర సుందరీకరణకు ప్రాధాన్యం



పార్కులో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: కర్నూలు నగర సుందరీకరణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే కల్లూరు అర్బన్ నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోని పార్కులో ఉదయం వాకర్స్‌తో కలిసి వాకింగ్ చేశారు. అనంతరం పార్కులో మొక్క నాటి నీళ్లు పోశారు. పార్క్ అభివృద్ధిపై ప్రజలతో కూర్చొని కాసేపు చర్చించారు. కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు–గుంటూరు జాతీయ రహదారిలో భూములు కోల్పోయే రైతులకు న్యాయమైన పరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కేవీ నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీఓను కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లగా ఆయన అందుబాటులో లేకపోవడంతో ఏఓ వేణుగోపాల్‌కు అందజేశారు.

మైనార్టీల సమస్యలను పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): ముస్లిం మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి ఎస్ఏ సుభాన్ డిమాండ్ చేశారు. సోమవారం అవాజ్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకాల్లో పదో తరగతి అర్హత నియమాన్ని తొలగించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్ షరీఫ్, మహబూబ్‌బాషా, షేక్ అబ్దుల్, సలీం తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ పునరుద్ధరించాలి

కర్నూలు(రూరల్): తపాలా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, పాత పెన్షన్ పునరుద్ధరించాలి అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళి డిమాండ్ చేశారు. నగరంలోని బీఏఎస్ కల్యాణ మడపంలో తపాలా శాఖ ఉద్యోగులు నిర్వహిస్తున్న రాష్ట్ర ద్వై వార్షిక మహాసభలు రెండో రోజు కొనసాగాయి. జనవిజ్ఞానవేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి, తపాలా శాఖ ఉద్యోగులు లక్ష్మీకాంత్, శమంతక రెడ్డి, గిరిబాబు, ఈశ్వరయ్య, నాగేంద్ర, డీఎఫ్‌టీ నాయకుడు రత్నం ఏసేపు, ప్రజా హక్కుల వేదిక నాయకుడు రామకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గౌరీ దేవికి వెండి పంచ పాత్రల విరాళం



వెండి వస్తువులను అందజేస్తున్న దాతలు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని సూర్య నారాయణ ఆలయం ఆవరణలో కొలువైన మహా గౌరీ అమ్మవారికి వెండి పంచ పాత్రలను సమర్పించారు. సోమవారం ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణకు ట్రస్ట్ సభ్యులు దాతలు డాక్టర్ ఆంజనేయులు, చంద్రావతమ్మ దంపతులు వెండి వస్తువులను అందజేశారు.

టీచర్ పోస్టులను బ్లాక్ చేయొద్దు

కర్నూలు సిటీ: జిల్లాలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను బ్లాక్ చేయకుండా అన్నీ ప్రదర్శించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కరె కృష్ణ, గట్టు తిమ్మప్ప సోమవారం డీఈఓ రంగారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. జీఓ 47లోని అసంబద్ధమైన నిబంధనలను సవరించాలని కోరారు.

వైద్య సిబ్బంది ఎఫ్ఆర్ఎస్‌లోనే హాజరు వేయాలి



వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): వైద్య సిబ్బంది తప్పనిసరిగా ఫేస్ రికగ్నేషన్ సిస్టమ్(ఎఫ్ఆర్ఎస్) యాప్‌లోనే హాజరు వేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్ చెప్పారు. సోమవారం ఆయన డాక్టర్స్ కాలనీలోని యూపీహెచ్‌సీని తనిఖీ చేశారు. అక్కడి ఓపీ రికార్డులు, మందుల గది, ల్యాబ్ రికార్డులు, వ్యాక్సిన్ నిల్వలు ఉండే శీతలీకరణ పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మహాలక్ష్మి, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నగరంలో అభివృద్ధి పరుగులు

- నాలుగేళ్లలో రూ.505 కోట్లతో పనులు
- 136 సచివాలయాల నిర్మాణం
- రూ.13.20 కోట్లతో డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్ల ఏర్పాటు
- రూ.82 కోట్లతో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు
- మన బడి నాడు–నేడుకు రూ.34 కోట్లతో మున్సిపల్ స్కూళ్ల ఆధునీకరణ
- రూ.45 కోట్లతో 15వ ఆర్థిక సంఘం నిధులతో సుందరీకరణ పనులు
- ఎన్టీఆర్ నగర్‌లో ఇల్లులేని పేదలకు 4,500 టిడ్కో ఇళ్లు
- నగరశివారులోని రుద్రవరంలో 27 వేల మందికి ఇళ్ల పట్టాల మంజూరు
- స్వచ్ఛతలో రాష్ట్రంలోనే నగరానికి ద్వితీయ స్థానం

ప్రజలకు సేవలందించేందుకు సచివాలయాలు.. మెరుగైన వైద్యం అందించేందుకు అర్బన్ హెల్త్‌సెంటర్లు.. భావిభారత పౌరులను తీర్చిదిద్దేందుకు పాఠశాలల ఆధునీకరణ.. నగర వాసుల ఆహ్లాదానికి వీధివీధినా పార్కులు.. స్వచ్ఛతలోనూ రాష్ట్రంలోనే నగరానికి ద్వితీయ స్థానం.. ఇవన్నీ ఈ నాలుగేళ్లలోనే సాధ్యమయ్యాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నగరంలో ఏ వైపు చూసినా అభివృద్ధి పరుగులు తీస్తోంది.



డాక్టర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన పార్క్‌లో ఆడుకుంటున్న చిన్నారులు



వీకర్‌సెక్షన్ కాలనీలో వెలసిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్

కర్నూలు నగరంలో చేపట్టిన, చేపడుతున్న అభివృద్ధి పనులు

- నాడు–నేడు కింద మున్సిపల్ స్కూళ్లకు రూ.34.99 కోట్లు
- గడప గడపకు మన ప్రభుత్వం పేరుతో రూ.15 కోట్లతో 133 అభివృద్ధి పనులు
- కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో రూ.500 కోట్లతో క్యాన్సర్ ఆసుపత్రి, వైద్య కళాశాల
- కర్నూలు నగరంలో ఆర్ అండ్ బీ రోడ్లకు రూ.8 కోట్లు
- 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.45.60 కోట్లు
- డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్లుకు రూ.13.22 కోట్లు
- తాగునీటి సమస్య పరిష్కారానికి పైపులైన్ కోసం రూ.82 కోట్లు
- తాగునీటి సరఫరాకు రూ.115 కోట్లు
- ఎస్టీపీలు (సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) రూ.131 కోట్లు
- నీటి శుద్ధి, పర్యవేక్షణ, సిల్ట్ తొలగించడం పనులు రూ.5.20 కోట్లు
- నగరపాలక నూతన భవన నిర్మాణానికి రూ.26 కోట్లు
- రూ.6.70 కోట్లతో తుంగభద్ర వద్ద పుష్కర ఘాట్ల నిర్మాణం
- పాత ఈద్గా ఆనంద్ థియేటర్ వద్ద రూ.11 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం
- రూ. 8 కోట్లతో వెంకటరమణ కాలనీలో మోడ్రన్ మున్సిపల్ కమర్షియల్ కాంప్లెక్స్
- రూ. 2 కోట్లతో బిర్లాగేట్ వద్ద ఈట్ స్ట్రీట్
- రూ. 2 కోట్లతో కొండారెడ్డి బురుజు వద్ద అభివృద్ధి పనులు

కర్నూలు (టౌన్): జగనన్న అధికారం చేపట్టిన నేటితో నాలుగేళ్లవుతుంది. ఈ నాలుగేళ్లలో కర్నూలు నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు అగ్ర స్థానం కల్పించిన ప్రభుత్వం.. అదే స్థాయిలో సంక్షేమానికీ ప్రాధాన్యత ఇచ్చింది. 52 వార్డుల్లో 136 సచివాలయాలను ఏర్పాటు చేసింది. ముఖ్యమైన 12 కూడళ్లలో డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసింది.

విద్యకు అగ్రస్థానం..

ఐదేళ్ల క్రితం నగరపాలక పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కలిపి 64 ఉండేవి. వీటి పరిస్థితి గతంలో దారుణంగా ఉండేది. బడికి వెళ్లే చిన్నారులు సైతం తాగునీటి కోసం సమీపంలోని ఇళ్ల వద్దకు, కుళాయిల వద్దకు వెళ్లేవారు, చుట్టూ ప్రహరీ ఉండదు. అసాంఘిక కార్యక్రమాలకు అడ్డూఅదుపూ ఉండేదికాదు. బ్లాక్‌బోర్డు కనిపించేది కాదు. ప్రస్తుత ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ నాడు– నేడు పథకం ద్వారా సర్కార్ బడులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దింది. కర్నూలు నగరంలో నాడు– నేడు కింద రూ.34.99 కోట్లు వెచ్చించి 133 వర్కులతో పెద్ద ఎత్తున మున్సిపల్ స్కూళ్లను అందంగా తీర్చిదిద్దింది. విద్యార్థులకు అమ్మ ఒడి పథకం అమలు చేస్తోంది. స్కూల్ బ్యాగ్ నుంచి పుస్తకాలు, డ్రెస్, షూ ఇలా ఎన్నో మార్పులు తీసుకువచ్చింది. కర్నూలు నగరంలోనే ఉన్న 139 అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి అందంగా తీర్చిదిద్దడమే గాకుండా పిల్లలకు బాలామృతం పేరుతో పోషకాహారం అందిస్తోంది.

డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణం

చదువుతో పాటు వైద్యానికీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. పేదలు అత్యధికంగా నివసించే ప్రాంతాలను ఎంపిక చేసి రూ.13.22 కోట్లతో 12 డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మించింది. రాయలసీమ జిల్లాలకు సేవలు అందిస్తున్న కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతి రోజు 3 వేలకు పైగా ఓపీతో నిత్యం కిటకిటలాడుతూ ఉంటుంది. దీంతో నగరంలో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ క్లినిక్‌ల వల్ల పేదమధ్య తరగతి ప్రజలకు వైద్యం మరింత చేరువైంది. ఇక కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే రూ.500 కోట్లతో క్యాన్సర్ ఆసుపత్రి, వైద్య కళాశాల నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయి. ఇటీవల రూ.12 కోట్లతో డయాగ్నోస్టిక్ సెంటర్లను రాష్ట్ర వైద్యశాఖ మంత్రి విడదల రజనీ ప్రారంభించారు.

రూ.505 కోట్లతో' మౌలిక సదుపాయాలు

అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.505 కోట్లు ఖర్చు చేశారు. వాటిలో రూ.82 కోట్లతో సుంకేసుల నుంచి మునగాల పాడు వరకు పైపులైన్ నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. ప్రతి ఒక్కరికీ శుద్ధ జలం అందించాలన్న ఉద్దేశంతో రూ.15 కోట్లతో మునగాలపాడు వద్ద వాటర్ ట్రీట్ మెంటు ప్లాంటు నిర్మాణ పనులు చివరి దశకుగ చేరుకున్నాయి. 14, 15వ ఆర్థిక సంఘం నిధులతో నగరంలో పార్కుల అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపడుతున్నారు. రూ.8 కోట్లతో చాణిక్యపురి కాలనీలో కార్టూన్ థీమ్ పార్కు, ఎస్‌బీఐ కాలనీలో మ్యూజిక్ థీమ్ పార్కు, గఫూర్ నగర్‌లో సైన్సు పార్కు, డాక్టర్స్ కాలనీలో కల్చరల్ పార్కు, చిల్డ్రన్స్ పార్కు వద్ద గ్లో గార్డెన్ పార్కులు నగర వాసులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. నగరంలోని 119 కిలో మీటర్ల పరిధిలో డివైడర్లకు రూ.50 లక్షలు వెచ్చించి రంగులు, బొమ్మలు, గ్రీనరీ కోసం ఇప్పటి వరకు 75 వేలు నాటారు. రూ.8 కోట్లతో నగరంలోని వెంకటరమణ కాలనీలో నగరపాలక మోడ్రన్ మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణం పనులు చేపడుతున్నారు. జొహరాపురంలో రూ.1.30 కోట్లతో రెండు ఇండోర్ స్టేడియాల రూపుదిద్దుకున్నాయి. అదే ఏరియాలోనే రూ.1 కోటి వెచ్చించి 1.45 ఎకరాల్లో క్రికెట్ ప్రాక్టీసు కోర్టు, టెన్నిస్ కోర్టు నిర్మాణాలు చేపట్టనున్నారు. రూ.34 కోట్లతో జొహరాపురం బ్రిడ్జి పూర్తి చేశారు. బ్రిడ్జి వెంట రూ.9 కోట్లు వెచ్చించి రోడ్డు వేశారు. ఇరువైపులా బట్టర్ ఫ్లై లైట్లు ఏర్పాటు చేశారు.

4,500 టిడ్కో ఇళ్లు.. 27 వేల ఇళ్ల పట్టాలు

జగన్నాథ గట్టు వద్ద ఉన్న ఎన్టీఆర్ నగర్‌లో ఇళ్లు లేని 4,500 మందికి టిడ్కో గృహాలు ఇచ్చారు. మరో 27 వేల మంది పేదలకు కర్నూలు మండలం రుద్రవరంలో ఇళ్ల పట్టాలు కేటాయించారు.

స్వచ్ఛతలో నగరానికి ద్వితీయ స్థానం

నగరంలో చెత్త డిబ్బాలు లేకుండా డస్ట్‌బిన్లు తొలగించారు. జొహరాపురం నుంచి గార్బేజీని గార్గేయపురం వద్దకు తరలించారు. ఇంటింటికి చెత్త డబ్బాలు పంపిణీ చేశారు. 45 కొత్త వాహనాలు కొనుగోలు చేశారు. 23 ఎకరాల పరిధిలో పేరుకుపోయిన డంప్ యార్డును రూ.8 కోట్లతో బయో మైనింగ్ ద్వారా తడిచెత్త, పొడిచెత్త చేసే పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. ఇక ప్రతి డివిజన్ పరిధిలో రూ.10 లక్షలతో నూతనంగా శానిటరీ భవనాలు నిర్మించారు. దీంతో స్వచ్ఛత అవార్డుల్లో రాష్ట్రంలోనే కర్నూలు నగరానికి ద్వితీయ స్థానం లభించింది.

సచివాలయం వల్లే పెన్షన్



నేను పాత కల్లూరులో నివసిస్తున్నా. పెన్షన్ కోసం గతంలో ప్రయత్నించినా రాలేదు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత మా ఇంటికి సమీపంలోనే 63వ సచివాలయం ఉంది. ఒకసారి వెళ్లాను. రెండవ రోజు వలంటీర్ వచ్చాడు. ఇంటి వద్దే అన్ని వివరాలు తీసుకున్నాడు. నెలన్నరకు వృద్ధాప్య పెన్షన్ మంజూరైంది. ఇంత త్వరగా మంజూరవుతుందనుకోలేదు. సచివాలయాల వల్లే ఇది సాధ్యమైంది. గతంలో ఏఏ పథకాలున్నాయో తెలిసేది కాదు. ఇప్పుడు వలంటీర్ ఇంటింటికి వచ్చి సమాచారం ఇస్తున్నాడు.

– రమణమ్మ, పాత కల్లూరు

పార్కుల అభివృద్ధి చేశారు



గతంలో ఎన్నడూ లేని విధంగా పార్కులను తీర్చిదిద్దారు. మేము క్రిష్ణనగర్‌లో నివసిస్తున్నాం. ఇక్కడ సమీపంలోనే మున్సిపల్ పార్కు ఉంది. గాయత్రీ ఎస్టేట్ వద్ద మున్సిపల్ పార్కు ఉంది. రెండూ చాలా ఉపయోగకరంగా ఉన్నాయి. పిల్లలను తీసుకెళ్తాను. పార్కులో మంచి వాతావరణం ఉంది. నడక కోసమే కాకుండా ఎక్సర్‌సైజులు చేసుకునేందుకు వీలుగా అక్కడ జిమ్ పరికరాలు అందుబాటులో ఉన్నాయి. అలాగే కల్చరల్ పార్కు, థీమ్ పార్కు, సైన్సు పార్కులు నగర వాసులకు ఆహ్లాదాన్నిస్తున్నాయి.

– మోహన్ రెడ్డి

పరిశుభ్రత పనులు బాగున్నాయి



నగరంలో పరిశుభ్రత వాతావరణం పెరిగింది. ఇంటింటికి చెత్త సేకరణ బాగుంది. మాకు ఇంటికి మూడు డస్ట్‌బిన్లు ఇచ్చారు. పారిశుధ్య సిబ్బంది రోజూ వచ్చి చెత్త తీసుకెళ్తున్నారు. ఇప్పుడు ఎక్కడ పడితే అక్కడ చెత్త కనిపించడం లేదు. దీని వల్ల పందుల సమస్య తగ్గింది. కాల్వలు శుభ్రం చేస్తున్నారు.

– సుమలత

వైద్యం చేరువైంది



పెద్దాస్పత్రిలో ఓపీ తీసుకుని డాక్టర్‌కు చూపించుకోవాలంటే ఎంతో సమయం పట్టేది. వందల సంఖ్యలో రోగులు వచ్చేవారు. చిన్నపాటి అనారోగ్య సమస్యకు చాలా సేపు వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేది. ఇటీవల నగరంలో అనేక చోట్ల డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో వైద్యం చేరువైంది.

– శ్రీనివాసులు, వీకర్ సెక్షన్ కాలనీ

స్పందన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

- కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): స్పందనలో వచ్చే వినతుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మున్సిపల్ ఎస్ఈ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.



కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న అర్జీదారులు

ఫిర్యాదుల్లో కొన్ని..

- తమ కాలనీలో డ్రైనేజీలు, అప్రోచ్ రోడ్లుకు మరమ్మతులు చేయాలని ప్రశాంత్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు రామగోపాల్, ప్రవీణ్‌లు వినతిపత్రం అందజేశారు.
- తమ కాలనీలో వీధి లైట్లు ఏర్పాటు చేయాలని ఐటీసీ కాలనీకి చెందిన మధుసూదన్‌రావు, చంద్రశేఖర్‌లు విన్నవించారు.
- వివిఎస్ ఫంక్షన్ హాలులోని సాయినాథ్‌నగర్, రామేశ్వర్‌నగర్ కాలనీలలో మురుగు కాల్వలు నిర్మించాలని అదే కాలనీలకు చెందిన నాగరాజు, ఎస్ఎండీ బాషా అభ్యర్థించారు.
- తమ ఏరియాలో సీసీ రోడ్లు నిర్మించాలని నాగేంద్రనగర్‌కు చెందిన అశోక్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు.
- తాగునీటిసౌకర్యం, డ్రైనేజీ వ్యవస్థఏర్పాటు చేయాలని సుంకేసుల రోడ్డులోని ధనలక్ష్మీనగర్‌కు చెందిన రామిరెడ్డి, రాజు విన్నవించారు.
- తమ కాలనీలో రోడ్లు, మురుగు కాల్వలు ఏర్పాటు చేయాలని వెంకటాద్రినగర్‌కు చెందిన నాగనాథరావు విన్నవించారు.
- మంచినీటి సమస్య పరిష్కరించాలని 29 వ వార్డు ఎస్ఎస్ఆర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు విన్నవించారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోండి

- ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ ప్రజలకు సూచించారు. సోమవారం ఆయన 3 వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. బండిమెట్ట, అలీషేర్ బాగ్ వీధి తదిరత ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలను పలకరించారు. ప్రభుత్వం నాలుగేళ్లలో మంజూరు చేసిన పథకాల సంక్షేమ క్యాలెండర్‌ను అందించారు. ప్రజల సమస్యలు విని వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల మతాలు,రాజకీయ పార్టీలు, సిఫార్సులకు తావు లేకుండా పథకాలు అమలు చేయడం తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. పథకాల లబ్ధిపొందిన వారంతా జగనన్నకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక వార్డు కార్పొరేటర్ షాజహాన్ పర్వీన్, నాయకులు ఖాదర్‌బాషా, మద్దయ్య, ఖుద్దూస్, చాంద్ బాషా, ముజాహీద్, వివిధ శాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



బండిమెట్టలో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కర్నూలు: స్థానిక సోమిశెట్టి కాలనీలో నివాసముంటున్న రబ్బానీ (39) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈయన ప్లంబర్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి రైల్వేస్టేషన్ రోడ్డులో ద్విచక్ర వాహనంపై స్పీడ్‌బ్రేకర్‌ను చూసుకోకుండా వేగంగా వెళ్లడంతో అదుపు తప్పి కింద పడటంతో తలకు గాయాలై మృతిచెందడంతో రెండో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించి సోమవారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

పేళ్ల మందు తాగి మహిళ మృతి..

బంగారుపేటలో నివాసముంటున్న మహేష్ భార్య కమల(22) పేళ్ల మందు తాగి అపస్మారక స్థితిలో చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందింది. ఆమె మేనకోడలు రత్న తలలో పేళ్లు ఉండటంతో శనివారం రాత్రి పేళ్ల మందు తెచ్చుకుని గ్లాసులో పోసుకుని తలకు అంటించుకునేందుకు కిటికీలో పెట్టుకుంది. రత్న బయటకు వెళ్లి వచ్చేలోగా చూసుకోకుండా అదే గ్లాసుతో కుండలోని నీళ్లు నింపుకుని కమల తాగడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందింది. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదల ఆత్మగౌరవాన్ని కించపరుస్తారా?

- వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లా అధ్యక్షులు కాటసాని, రామయ్య
- చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బైక్ ర్యాలీ



నంద్యాల చెక్‌పోస్టు వద్ద బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య

కల్లూరు : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఖరీదైన ఇంటి స్థలాలను ఇస్తుంటే ఓర్వలేక వారి ఆత్మగౌరవాన్ని కించపరుస్తారా? అంటూ టీడీపీ అధినేత చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య మండిపడ్డారు. అమరావతి ప్రాంతంలో పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాలను సమాధులతో పోల్చిన చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కల్లూరు అర్బన్ నంద్యాల చెక్‌పోస్టు నుంచి బైక్ ర్యాలీ ప్రారంభించారు. సి.క్యాంపు సెంటర్, బిర్లాకాంపౌండ్, కృష్ణనగర్, చెన్నమ్మ సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. వారు మాట్లాడుతూ.. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పని చేశాని గొప్పగా చెప్పుకునే చంద్రబాబు నాయుడు పేదల ఇంటి స్థలాలను సమాధులతో పోల్చడం దారునమన్నారు. తన పాలన కాలంలో ఎన్నడైనా పేదలకు సెంటు స్థలం ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. అమరావతిలో ఇళ్ల పట్టాల ద్వారా చంద్రబాబు ఎవరి పక్షమో తేలిపోయిందన్నారు. సెంటూ స్థలం సమాధికి అయితే మరీ అంతకన్నా తక్కువ స్థలంలో చంద్రబాబు నిర్మించిన టిడ్కో ఇళ్లను ఏమనాలని ప్రశ్నించారు.

ఇచ్చిన హామీలను 98శాతం అమలు చేశాం

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలలో 98శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. నవరత్నాల పేరుతో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. 2014లో చంద్రబాబు రైతుల రుణమాఫీ, పొదుపు సంఘాల రుణమాఫీ అని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేశారని, దీంతో పొదుపు సంఘాల సభ్యులు డీఫాల్టర్లుగా మారరని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రజలే చంద్రబాబుకు రాజకీయంగా సమాధి కడతారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్వేతారెడ్డి, అరుణ, శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, నారాయణరెడ్డి, నరసింహులు, వెంకటేశ్వర్లు, డీఏఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెలవుల మంజూరుపై హర్షం

కర్నూలు సిటీ: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల మహిళా ఉపాధ్యాయులకు ప్రభుత్వం 5 ప్రత్యేక సెలవులను మంజూరు చేయడంతపై పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మిట్టా క్రిష్ణయ్య, వి.కరుణానిధిమూర్తి సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి



కార్మికునికి ఈసీజీ తీస్తున్న వైద్య సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): నలభై ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ వారి వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ కర్నూలు బ్రాంచ్ మేనేజర్ అరుణ్‌కుమార్ సూచించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా భారత్ పెట్రోలియం కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్, కిమ్స్ హాస్పిటల్, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్‌ల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం భారత్ పెట్రోలియం లిమిటెడ్ రీజినల్ కార్యాలయంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో కంటి వైద్యులు జయప్రకాష్, లయన్స్ జిల్లా గవర్నర్స్ ప్రతినిధి రాయపాటి శ్రీనివాస్, డాక్టర్ సాయిలోకేష్ పాల్గొన్నారు.

పేదల స్థలాలపై బాబు వ్యాఖ్యలు దుర్మార్గం



వైఎస్సార్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ తదితరులు

- ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మేయర్ రామయ్య

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ప్రభుత్వం అమరావతిలో పేదలకు ఇచ్చే స్థలాలు చచ్చాక సమాధులుగా పనికి వస్తాయని చంద్రబాబు వ్యాఖ్యానించడం దారుణమని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మేయర్ బీవై రామయ్య అన్నారు. సోమవారం స్థానిక పాతబస్తీలోని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి పూలబజార్, ఓల్డ్ టౌన్, ఉస్మానియా కళాశాల, కిడ్స్ వరల్డ్, రాజ్‌విహార్, ఆర్ఎస్ రోడ్డు మీదుగా వైఎస్ఆర్ సర్కిల్ వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అక్కడ మహానేత వైఎస్ఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో అధికారంలో ఉన్న చంద్రబాబు ఏనాడూ పేదలకు ఇళ్లు ఇవ్వలేదని, తమ ప్రభుత్వం 30 లక్షల ఇళ్లు పంచేందుకు చర్యలు చేపడితే విషం చిమ్ముతున్నాడని మండిపడ్డారు. ఎక్కడ పట్టాల పంపిణీ చేసినా ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకొని అసత్య ప్రచారం చేస్తున్నాడన్నారు. అత్యున్నత న్యాయ స్థానం సుప్రీం కోర్టు సైతం ఆదేశాలు జారీ చేసినా టీడీపీ నేతలకు కడుపు మంట చల్లారడం లేదన్నారు. తమ ప్రభుత్వ ఇచ్చే 435.6 చదరపు అడుగుల స్థలాలను సమాధులతో పోల్చితే టీడీపీ ప్రభుత్వం నిర్మించిన 300– 430 చదరపు అడుగుల మధ్య నిర్మించిన టిడ్కో ఇళ్లను ఏమనాలో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, పార్టీ నాయకులు సీహెచ్ మద్దయ్య, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయిన సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సంబరాలు చేసుకున్నారు.